

# చేతివేళ్లు

పాలంకి సత్య

అబ్బాయైనా, అమ్మాయైనా నాకు సమానమేనంటూ ఇద్దరమ్మాయిల తోటే ఫుల్‌స్టాప్ పెట్టి అభ్యుదయ మార్గంలో నడిచాడు అనంతమూర్తి. వాణి, రాణి అని ముద్దుగా పేర్లు పెట్టుకుని, అల్లారు ముద్దుగా పెంచాడు.

తండ్రి ఆశలు అడియాసలు చెయ్యకుండా ఇద్దరమ్మాయిలూ బాగా చదువుకున్నారు. స్టేట్ మొదటి రాకుల్లోనే ఉండేలా టెన్త్ పాసయింది వాణి

అనంతమూర్తి మురిసిపోయాడు. వాణిని ఎంతగానో అభినందించాడు.

"రాణీ, నువ్వూ అక్కలా చదవాలి" అని హెచ్చరించాడు.

రాణి తలూపింది.

"వాణీ, ఇంటర్మీడియెట్‌లో కూడా రాంకు రావాలి" అన్నాడు. వాణి కూడా తల ఊపింది.

* * *

వాణి ఇంటర్మీడియెట్ రిజల్ట్స్, రాణి టెన్త్ క్లాసు రిజల్ట్స్ ఒకేసారి వచ్చాయి. వాణి స్టేట్ ఫస్ట్‌గా పాసయింది.

రాణికీ టెన్త్‌లో మంచి మార్కులొచ్చాయి.

"ఇంటర్‌లో రాంకు తెచ్చుకో" అన్నాడు తండ్రి.

రాణి సరేనన్నట్లుగా తల ఊపడంలో అంత ఉత్సాహం లేదు.

వాణికి ఎంట్రెన్స్ రాంకు ప్రకారం గవర్నమెంట్ కాలేజీలో మెడిసన్‌లో సీటు వచ్చింది.

"అక్క మెడిసిన్ చదువుతోందిగా, నువ్వు ఇంజనీరింగ్ చదువుదువుగానీ" అన్నాడు అనంతమూర్తి.

రాణికి ఫాషన్ టెక్నాలజీ కానీ, ఇంటీరియర్ డెకరేషన్ కానీ చదివి సొంతంగా బిజినెస్ చెయ్యాలని ఉంది.

కానీ తండ్రి దృష్టిలో ఎదగాలంటే అకడమిక్ లైన్ తప్పని సరి.

కొడుకులైనా, కూతుళ్లైనా మీరే అని పెంచిన తండ్రిని నిరాశపరచడం ఆమె కిష్టం లేదు.

మాథమాటిక్స్ అంతగా కొరకరాని కొయ్య లాంటి సబ్జెక్టు కాదు.

రాణి ఇంటర్మీడియెట్‌లో ఎమ్.పి.సి. గ్రూపు తీసుకుని, ఇంజనీరింగ్ ఎంట్రెన్స్ కోచింగ్ క్లాసులకి వెళ్లసాగింది.

మధ్యతరగతి కుటుంబీకుడైన అనంతమూర్తి పిల్లలకు తనివ్వగలిగిన ఆస్తి చదువు మాత్రమే అంటూ ఉండేవాడు.

* * *

రాణి ఇంటర్మీడియెట్‌కూ, ఇంజనీరింగ్ ఎంట్రెన్స్‌కూ చాలా కష్టపడి చదివింది. మనస్సును ఏ ఇతర వ్యాపకం మీదకూ పోనివ్వలేదు.

ఇంటర్మీడియట్ నూటికి ఎనభై అయిదు దాకా మార్కులు వచ్చాయి. ఎంట్రెన్స్ పరీక్షలో వచ్చిన రాంకుకి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో సీటు వచ్చింది.

"అక్కలా గవర్నమెంట్ కాలేజీలో సీటు తెచ్చుకుంటా వనుకున్నాను. ప్రైవేటు అయితే మాత్రం చదివించక తప్పుతుందా? ఇంజనీరింగ్ చదువు."

తన మనస్సులోని ఆశ చెప్పలేకపోయింది రాణి. ఇంజనీరింగ్ అయినా మంచి మార్కులతో పాసయి, అక్కతో సమానమనిపించు కోవాలి. తండ్రి తనను కూడా మెచ్చుకోవాలి అదే ఆమె ధ్యేయం.

తండ్రి మాత్రం ఆమె చదువుకి అవుతున్న ఖర్చుని మరిచిపోలేదు. ఎప్పుడూ ప్రైవేటు కాలేజీలో చదువుతున్న సంగతి జ్ఞాపకం చేసేవాడు.

ఇంటి కొచ్చిన వారికి కూతుళ్లని ఇంట్రడ్యూస్ చేసే పద్ధతికూడా రాణికి బాధని కల్గించేది.

"మా పెద్దమ్మాయి వాణి. ఎంట్రన్స్ రాంకుతో పాసయింది. గవర్నమెంట్ కాలేజీలో మెడిసన్ చదువుతోంది చిన్నమ్మాయి రాణి . పెద్దదానితో సమంగా చదివించక తప్పుతుందా? ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలో చదివిస్తున్నాను. అప్పు చెయ్యకుండా చదువు పూర్తవుతుందో లేదో!"

తండ్రిమాటలు విన్నకొద్దీ రాణిలో దుఃఖం పెరిగిపోసాగింది. తను ఎప్పటికీ అక్కలా చదవలేదు. తన చదువు తండ్రికి భారమైంది. తనలాంటి వాళ్లు కాలేజికి వెళ్లి చదవడం దండగ. తను చదువు మానేస్తేనే మంచిదేమో!

రాణిలో ఆలోచనలు విద్యాభ్యాసానికి విముఖంగా దారి తీయసాగేయి. ఎంత ప్రయత్నించినా ఆమె చదవలేకపోయింది. చదువులో విఫలమైన కొద్దీ ఆమె ఆలోచనలు మరింత నిరాశామార్గం పట్టాయి.

హాయిగా కాలేజికి వెళ్లిరావల్సిన పద్దెనిమి దేళ్ల అమ్మాయి సైకియాట్రిస్టుల చుట్టూ తిరగడం ప్రారంభమైంది.

చేతి అయిదు వేళ్లూ ఒక్కలా ఉండాలను కోవడం ఎంత పొరపాటో, పుట్టిన పిల్లలందరూ ఒకేలా ఉండాలనుకోడం అంతే పొరపాటు కాదా? ఒక్కో వేలికీ ఒక్కో ఉపయోగం. ఒక్కో బిడ్డ ఒక్కో రంగంలో రాణించవచ్చునేమో! ఆలోచించండి. ●






**మా వాడయితే...**

"చూశారా రామారావు గారూ, మీ అబ్బాయి అల్లరి మరీ ఎక్కువయి పోతున్నది. ఈ రోజు మా మొక్కల పూలన్నీ కోసేవాడు."

"మొక్కలు జాగ్రత్తగా ఉన్నాయా?"

"ఆఁ."

"అయితే మా వాడు కాదు. మా వాడయితే మొక్కలు కూడా పీకేస్తాడు."

"ఆ !!!"

వి.వి. సీతారామదాసు (గుంటూరు)